

ఇసుక మాఫియాకు
పోలీసులంటే లెక్కలేదా?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -137 గురువారం 5 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

తెలంగాణ కులగణన దేశానికే రోల్ మోడల్

శ్రీకృష్ణ సదర్ ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర మరువలేనిది

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి: తేజస్వీ యాదవ్



హైదరాబాద్:నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ కులగణనను ప్రామాణికంగా తీసుకుందని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. **మిగతా 2లో...**


ట్రంప్‌పై వెల్లువెత్తిన ప్రజాగ్రహం

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఘోర పరాజయం

ఉభయ సభల్లో డెమొక్రాట్ల ఆధిపత్యం..

ట్రంప్ విధానాలపై ఓటర్ల అసంతృప్తి

వాషింగ్టన్:నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక, విదేశాంగ విధానాలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించింది. ప్రతినిధుల సభతో పాటు సెనెట్‌లోనూ డెమొక్రటిక్ పార్టీ ఆధిక్యత సాధించడంతో అమెరికా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది.పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన వ్యయం, ఇరాన్‌తో యుద్ధ పరిణామాలు, వాణిజ్య సుంకాలు, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు రిపబ్లికన్లకు ప్రతికూలంగా మారాయి. ట్రంప్‌కు మద్దతుగా నిలిచిన పలువురు అభ్యర్థులు సైతం ఓటమి చవిచూడటం **మిగతా 2లో...**

గ్లోబల్ సమ్మిట్‌పై కేబినెట్ దృష్టి!

నేడు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం

పెట్టుబడులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ



2లో.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు

కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు

కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్

రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు

హైదరాబాద్ నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):



కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా**మిగతా 2లో...**

ఈడీ విచారణకు హాజరైన అంబటి

గతంలో అనారోగ్య కారణాలతో విచారణకు హాజరుకాని అంబటి

మద్యం రవాణా టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపణలు



అమరావతినవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. మద్యం రవాణా కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేస్తున్నారు.

ఈ కేసులో విచారణకు రావాలని గతంలోనే ఈడీ అంబటికి నోటీసులు ఇచ్చింది. అయితే, తనకు**మిగతా 2లో...**

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

చట్టం అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు!

పర్యవేక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచన..

రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు చర్యలు

2లో.


నేడే పరిషత్ పోరు..

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం: ఎస్ఈసీ పునేఠా

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎన్నికలపై ఎస్ఈసీ సమీక్ష.. కీలక ఆదేశాలు

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

అమరావతి నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):



ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పోలింగ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆయన తెలిపారు. బుధవారం విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లకు, సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ఎన్నికల కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ, పోలింగ్ విధుల్లో 2.52 లక్షల మంది, కౌంటింగ్‌లో **మిగతా 2లో...**

అందరికీ అనుగుణంగా పరీక్షా విధానం



అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా విధానం ఉండాలి: సీఎం చంద్రబాబు

నందన్ నీలేకని నేతృత్వంలోని హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ బృందంతో చంద్రబాబు భేటీ

రాష్ట్రాల ఏకాభిప్రాయంతో సంస్కరణలు చేపట్టాలి: సీఎం

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా పరీక్షల విధానం ఉండాలన్న మంత్రి లోకేశ్

పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగంపై దృష్టి

సారించామన్న నీలేకని

ఏపీలో అమలవుతున్న టెక్నాలజీ విధానాలపై టాస్క్‌ఫోర్స్ ఆసక్తి

అమరావతి నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):

భారతదేశంలోని విభిన్న రాష్ట్రాలు, విభిన్న భాషల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా సంస్కరణలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను గౌరవిస్తూ,**మిగతా 2లో...**

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు..

కేంద్రం కీలక నిర్ణయం

నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మందికి వెసులుబాటు

పొడిగింపు తర్వాతా శాశ్వత సర్వీసుకు అవకాశం

ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకాలు

రాత పరీక్ష తర్వాతే శారీరక పరీక్ష.. నైపుణ్య ధ్రువపత్రాలు

తొలి బ్యాచ్ సర్వీసు గడువు డిసెంబరులో ముగింపు



2లో.

అందరికీ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

తెలంగాణ కులగణన దేశానికే రోల్ మోడల్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్న సదర్ ఉత్సవం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవులకు అన్ని రంగాల్లో తగిన గౌరవం కల్పిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించడంతో పాటు ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించిన విషయాన్ని గుర్తుచేశారు.



ఒకప్పుడు గోల్కొండ కోటను గొల్లంకొండగా పిలిచేవారని సీఎం ప్రస్తావించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని అన్నారు. సదర్ వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని, ఇందుకోసం రూ. 5 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. మూసీ పునరుద్ధరణ, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి యాదవులు సహకరించాలని కోరారు.



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని అన్నారు. సదర్ ఉత్సవాల ద్వారా యాదవ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు ఆర్థిక రంగంలోనూ వారు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకలని పేర్కొన్నారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యాదవులు ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. సదర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు, మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనం కేవలం యాదవ సోదరుల పండుగే కాదని, అది తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ.. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వేడుకల నిర్వహణ కోసం రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.



గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించే ఆలోచన చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని నేటి గోల్కొండ కోట ఒకనాటి 'గొల్లంకొండ' అని, నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే పదవి ఇచ్చామని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఈశ్వరమ్మ యాదవ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.తెలంగాణలో విజయవంతంగా నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాబోయే రోజుల్లో యాదవులకు న్యాయమైన వాటా దక్కేలా చూస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టలో గోసంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి ప్రాజెక్టులకు యాదవ సోదరులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడే పరిషత్ పోరు..

మొదటిపేజీ తరువాయి

52 వేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీకి అనుమతిస్తామని, ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2.61 కోట్లకు చేరిందని పేర్కొన్నారు.

ఎన్నికల బందోబస్తుపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్నందున రద్దీని నియంత్రించేందుకు తగినంత బలగాలను మోహరించామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 582 జెడ్పీటీసీ స్థానాలు, 7,767 ఎంపీటీసీ స్థానాలకు గాను ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే 77 జెడ్పీటీసీ స్థానాలు, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడంతో, మిగిలిన స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల బరిలో 2,169 మంది జెడ్పీటీసీ అభ్యర్థులు, 18,843 మంది ఎంపీటీసీ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఈ ఎన్నికల్లో మొత్తం 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.28 కోట్ల మంది పురుషులు, 1.32 కోట్ల మంది మహిళలు, 1,282 మంది ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. ఓటర్ల సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 8,904 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 7,160 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. 16,064 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, సుమారు 6,000 కేంద్రాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్, 6,507 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

ఎన్నికల విధుల్లో భాగంగా 36,684 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 40,679 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 4,442 భారీ వాహనాలు, 3,200 తేలికపాటి వాహనాలను వినియోగిస్తున్నారు. పోలింగ్ కోసం 1,01,618 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 365 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 9,062 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాలపై పట్టు నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు..

నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):

అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉన్న నాలుగేళ్ల సర్వీసుకు అదనంగా మరో రెండేళ్లు పొడిగించాలని నిర్ణయించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పదవీకాలం ముగియనున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ నిర్ణయం ప్రకారం, నాలుగేళ్ల సేవ తర్వాత సాధారణ విధానంలో శాశ్వత సైనికులుగా ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు పనిచేసే అవకాశం లభించనుంది. ఈ పొడిగించిన సేవ పూర్తయ్యాక కూడా ప్రతిభ ఆధారంగా సాధారణ సైనిక విభాగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వెల్లడించారు.

అగ్నిపథ్ పథకం 2022లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ పథకం కింద సైన్యం, నౌకాదళం, వాయుసేనల్లో నాలుగేళ్ల కాలానికి నియామకాలు చేపడుతున్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని ప్రతిభ, సైనిక దళాల అవసరాల ఆధారంగా సాధారణ సర్వీసులో కొనసాగించే అవకాశం ఉంది. మిగిలినవారు విధుల నుంచి వైదొలగాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో వారికి అదనపు సేవా అవకాశం లభించనుంది.

నియామక ప్రక్రియలోనూ మార్పులు ప్రకటించారు. ఇకపై శారీరక పరీక్షకు ముందుగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ, నైపుణ్యాలను గుర్తిస్తూ ధ్రువపత్రాలు కూడా అందించనున్నారు. తొలి బ్యాచ్‌లో సుమారు 18 వేల మంది అగ్నివీరుల నాలుగేళ్ల సర్వీసు గడువు 2026 డిసెంబరులో ముగియనుండటంతో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈడీ విచారణకు హాజరైన అంబటి

మొదటిపేజీ తరువాయి

ఇటీవల గుండెకు స్టెంట్లు వేశారని, అనారోగ్య కారణాలతో హాజరుకాలేనని ఆయన వైద్య నివేదికలతో పాటు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో, నవంబర్ 4న తప్పనిసరిగా విచారణకు రావాలని ఈడీ మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఆయన హైదరాబాద్‌లోని కార్యాలయానికి వచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్లలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. కొందరికి అనుకూలంగా టెండర్ నిబంధనలు మార్చారని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌లను ఈడీ అరెస్ట్ చేసింది.

గతంలో నోటీసులు అందుకున్నప్పుడు "తాను ఏ తప్పూ చేయలేదని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని" అంబటి రాంబాబు పేర్కొన్న విషయం తెలిసిందే.

అందరికీ అనుగుణంగా పరీక్షా విధానం

మొదటిపేజీ తరువాయి

ఏకాభిప్రాయంతో అత్యంత పారదర్శకమైన, విశ్వసనీయమైన జాతీయ పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థికైనా, ఏ భాష మాట్లాడే వారికైనా న్యాయం జరిగేలా ఈ సంస్కరణలు రూపుదిద్దుకోవాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఎగ్జామినేషన్ రిఫార్మ్ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ సందర్భంగా సచివాలయానికి విచ్చేసిన నీలేకనికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు.ఈ భేటీలో టాస్క్ ఫోర్స్‌కు పలు కీలక సూచనలు చేసిన చంద్రబాబు, నేటి తరం విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరీక్షల విధానంలో మార్పులు రావాలని అన్నారు. విద్య కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం కాకూడదని, విద్యార్థులలో నైపుణ్యాలు, సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గాలి: మంత్రి లోకేశ్

ఈ సమావేశంలో పాల్గొన్న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, దేశవ్యాప్తంగా పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని తగ్గించేలా పరీక్షల విధానాన్ని సరళీకరించాలని సూచించారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి విద్య, ఉద్యోగాల కోసం వెళ్లేటప్పుడు భాష, విద్యా విధానం, ధ్రువీకరణ పత్రాల పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు జాతీయ స్థాయిలో సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ వినియోగం గురించి వివరిస్తూ, రాష్ట్రంలో 'డేటా లేక్' ద్వారా వివిధ రంగాల సమాచారాన్ని ఒకేచోట సమీకరించి, మెరుగైన పాలనా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

పరీక్షల విధానంలో సమూల మార్పులే లక్ష్యం: నందన్ నీలేకని

అనంతరం టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడంపై తాము ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, డిజిటల్ ఫోరెన్సిక్స్ విభాగాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా పనిచేస్తున్నామని వివరించారు.

ఈ సంస్కరణల రూపకల్పనలో భాగంగా తాము వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని, ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్కరణలపై అభిప్రాయాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికతను వినియోగించి అమలు చేస్తున్న విధానాలపై ఆయన ప్రత్యేక ఆసక్తిని వ్యక్తం చేశారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు

మొదటిపేజీ తరువాయి

వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు.అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

న్యూఢిల్లీ,నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త);

బాల కార్మికుల నిషేధ చట్టం అమలును మరింత కఠినతరం చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాల కార్మికుల (నిషేధం, నియంత్రణ) సవరణ చట్టం2016 అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు సంస్థలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సూచించింది.జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 14 ఏళ్లలోపు పిల్లలను అన్ని రకాల వృత్తులు, పనుల్లో నియమించడాన్ని నిషేధించే ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొంది.

2009 నాటి పిటిషన్‌పై విచారణ బాల కార్మికుల చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ 'హెల్ప్ ఫర్ మిలియన్స్' అనే స్వచ్ఛంద సంస్థ 2009లో పిటిషన్ దాఖలు చేసింది. పిల్లలకు విద్యా సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం కల్పించాలని కూడా కోరింది. 2016లో చట్ట సవరణతో పిటిషనర్ లేవనెత్తిన అంశాలు పరిష్కారమయ్యాయని కేంద్రం కోర్టుకు తెలిపింది. దీంతో పిటిషన్‌పై తదుపరి విచారణ అవసరం లేదని పేర్కొన్న ధర్మాసనం, సవరించిన చట్ట నిబంధనలను మాత్రం కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది.

ట్రంప్‌కు ప్రజల షాక్.. భారత్‌లోనూ మార్పు వస్తుందంటున్న కాంగ్రెస్!

న్యూఢిల్లీ,నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త);:అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడం భారత రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. డెమోక్రాట్ల విజయం కాంగ్రెస్ నేతల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. భారత్‌లోనూ రాజకీయ మార్పు సాధ్యమేనంటూ 'యెస్.. వీ కెన్ టూ' (అవును.. మనమూ సాధించగలం) అనే నినాదంతో నేతలు స్పందిస్తున్నారు.నవంబర్ 3న జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిలోనూ మెజారిటీ సాధించారు. ఈ ఫలితాలను ట్రంప్‌కు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' విధానాన్ని కూడా ఆయన విమర్శించారు.కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ శామా మహమ్మద్ స్పందిస్తూ.. భారత్‌లోనూ త్వరలో ఇలాంటి రాజకీయ మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రభుత్వాలకు ప్రజలు ఎన్నికల ద్వారా సమాధానం చెబుతారని పేర్కొన్నారు. 'ఇండియా విల్ సూన్ ఫాలో' అంటూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు.

గ్లోబల్ సమ్మిట్‌పై కేబినెట్ దృష్టి!

హైదరాబాద్, నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త); : తెలంగాణ మంత్రిమండలి సమావేశం గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. అంతకుముందు మధ్యాహ్నం 3 గంటలకు మంత్రులతో సీఎం అనధికా రికంగా సమావేశం కానున్నారు.ప్రధానంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లు, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చి ంచనున్నట్లు సమాచారం. వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలు, పరిశ్రమలకు భూకేటాయిం పులు, కొత్త ప్రాజెక్టులకు అనుమతుల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితు లు, వ్యవసాయంపై ప్రభావం, తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలపైనా మంత్రిమండలి సమీక్షించను న్నట్లు తెలుస్తోంది. రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథ కాల అమలు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించే అవకాశం ఉంది.వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలు, పరిపాలనాపరమైన అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకోనుంది. సమావేశంలో వెలువడే నిర్ణయాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

ట్రంప్‌పై వెల్లువెత్తిన ప్రజాగ్రహం

మొదటిపేజీ తరువాయి

రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎన్నికల ఫలితాల్లో డెమొక్రాట్లు రెండు సభల్లోనూ ఆధిక్యత సాధించారు. రిపబ్లికన్లకు బలమైన పట్టున్న అయోవా, కాన్సాస్, సౌత్ కరోలినా వంటి రాష్ట్రాల్లోనూ డెమొక్రటిక్ అభ్యర్థులు విజయాలు సాధించడం విశేషం. దీంతో ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలపై కాంగ్రెస్‌లో ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది.ప్రభుత్వ విధానాలు, అవినీతి ఆరోపణలు, వివాదాస్పద నిర్ణయాలపై విచారణకు డెమొక్రాట్లు సిద్ధమవుతున్నారు. అవసరమైతే అభిశంసన ప్రక్రియను కూడా ముందుకు తీసుకెళ్లే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఎన్నికల ఫలితాలపై స్పందించిన ట్రంప్.. ఇరాన్ యుద్ధం, పెరిగిన ఇంధన ధరలు తమ పార్టీ ఓటమికి కారణమయ్యాయని పేర్కొన్నారు. ప్రజలు ఇంధనం కోసం అధికంగా ఖర్చు చేయాల్సి రావడం ఎన్నికలపై ప్రభావం చూపిందని అంగీకరించారు. డెమొక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని చెబుతూనే, అవసరమైతే తన వీటో అధికారాన్ని వినియోగిస్తానని స్పష్టం చేశారు.ఈ ఎన్నికల్లో భారతీయ సంతతికి చెందిన పలువురు అభ్యర్థులు కీలక విజయాలు సాధించారు. సుహాస్ సుబ్రమణ్యం, పియా దండియా, రో ఖన్నా, అమీ బెరా తదితరులు తమ స్థానాల్లో విజయం సాధించారు. మరోవైపు రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసిన వివేక్ రామస్వామి ఓటమి పాలయ్యారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ పదవికి పోటీ చేసిన తెలుగు సంతతికి చెందిన సరితా కోమటిరెడ్డి కూడా పరాజయం చవిచూశారు.అమెరికా రాజకీయాల్లో భారతీయ సంతతి అభ్యర్థుల ప్రాతినిధ్యం పెరుగుతుండటం ఈ ఎన్నికల్లో మరో ముఖ్యాంశంగా నిలిచింది.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టిన స్కూటీ.. యువకుడి కాలు రెండు చోట్ల విరిగి శస్త్రచికిత్స

నిందితుడిపై కేసు నమోదు చేసిన హసన్‌పర్తి పోలీసులు

హసన్‌పర్తి/నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):
అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ యువకుడి పాలిట శాపంగా మారింది. వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని స్కూటీతో ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడి ఎడమ కాలు రెండు చోట్ల విరిగింది. ఈ ఘటనపై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యమన్‌పల్లి గ్రామానికి చెందిన కల్వచర్ల భాస్కర్ (24), తన తమ్ముడు కల్వచర్ల వాసు (22)తో కలిసి ద్విచక్ర వాహనంపై కనుకుల గిద్దె గ్రామంలోని మేనమామ ఇంటికి వెళ్లి తిరిగి హనుమకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో అక్టోబర్ 22న రాత్రి 8 గంటల సమయంలో హసన్‌పర్తి గ్రామానికి చేరుకోగానే లండిగ లక్ష్మణ్ రావు తన స్కూటీని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక నుంచి వచ్చి వారి ద్విచక్ర



వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బైక్ వెనుక కూర్చున్న వాసు ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్కూటీ నడిపిన లక్ష్మణ్ రావు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గార్డియన్ ఆసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వైద్య పరీక్షల్లో వాసు ఎడమ కాలు రెండు చోట్ల విరిగినట్లు నిర్ధారణ కావడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి రాడ్ అమర్చారు. వారం రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందాల్సి రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఆలస్యమైందని బాధితుడి సోదరుడు భాస్కర్ పేర్కొన్నాడు. ఈ మేరకు బాధితుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో నవంబర్ 3న సాయంత్రం 6.15 గంటలకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన లండిగ లక్ష్మణ్ రావుపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.

చుంచనకోటలో అక్రమ మట్టి దందా గుట్టురట్టు!

మట్టితో ఉన్న టిప్పర్‌తో పాటు మూడు ట్రాక్టర్లు పట్టివేత

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవు .ఎస్సై అపూర్వారెడ్డి







జనగామ/చేర్యాల, నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):
చేర్యాల మండలంలో అక్రమ మట్టి తరలింపుపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని చుంచనకోట గ్రామంలో బుధవారం తనిఖీలు చేపట్టిన పోలీసులు మట్టితో ఉన్న ఒక టిప్పర్‌తో పాటు మూడు ఖాళీ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అపూర్వారెడ్డి వెల్లడించారు.
ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తవ్వడం, తరలించడం చట్టవిరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ సాగించే అక్రమ దందాలకు అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు.



రైతులకు అండగా ప్రభుత్వం..

గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి.. మద్దతు ధరకు ప్రతి గింజ కొనుగోలు చేయాలి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలి : మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి

జనగామ/చేర్యాల, నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త):
రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించడంతో పాటు, దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.



చేర్యాల మండల పరిధిలోని వేచరేణి, పోతిరెడ్డిపల్లి, నాగపురి, పెదరాజుపేట, శభాష్ గూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ రైతులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంటను సాగు చేస్తున్నారని, తీరా పంట చేతికొచ్చిన సమయంలో దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
రైతుల కష్టాలను గుర్తించిన ప్రజా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ సంచులు, తూకం యంత్రాలు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. తూకం, నాణ్యత పరిశీలన, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన తదుపరి ప్రక్రియను ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర, కొనుగోలు విధానంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రైతులు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామని ప్రశాంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ కొనసాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చేర్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంజ మల్లేష్, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సీసీలు, సీఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం కుమ్మరి సంఘం నూతన అడ్‌హాక్ కమిటీ ఎన్నిక



కేసముద్రం/ నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త): కేసముద్రం మండలంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు నూతన అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో బుధవారం జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘం సమావేశంలో నూతన కమిటీని ఖరారు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అల్వాల ఉపేందర్ మాట్లాడుతూ కేసముద్రం మండలానికి నూతన అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా కొత్తపల్లి వీరస్వామి, మండల కన్వీనర్‌గా కొత్తపల్లి చంద్రయ్య, కో-కన్వీనర్లుగా చిలువేరు లింగయ్య, మర్రిపల్లి మొగిలి, మనుగొండ రమేష్, అల్వాల శ్రీకాంత్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కుమ్మరి సంఘం అభివృద్ధికి, కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న సభ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. సంఘం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతోపాటు సభ్యుల హక్కులు, సంక్షేమ పథకాల సాధనకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సంఘంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ ఐక్యతతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో జిల్లా కో-కన్వీనర్ సముద్రాల సోమయ్య, గౌరవ అధ్యక్షులు అల్వాల శ్రీనివాస్, జిల్లా ప్రచార కార్యదర్శి మల్యాల నరసయ్య, ముత్యాల అశోక్, కొత్తపల్లి రమేష్, కొత్తపల్లి చంద్రయ్య, కొత్తపల్లి వెంకన్న, సాలయ్య, మల్యాల రాములు, గణపారపు రమేష్, మనుగొండ వెంకన్న, సలిగంటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులకు ప్రజలందరూ సహకరించాలి

పట్టణ అభివృద్ధికి డబుల్ సీసీ రోడ్డు ఎంతో ఉపయోగకరం

మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్

స్టేషన్ ఘన్‌పూర్ /నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త):



పట్టణ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ కోరారు. పట్టణ కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం మీదుగా బస్టాండ్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న రాకపోకలు, వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు వెడల్పు పూర్తయి డబుల్ సీసీ రోడ్డు నిర్మాణం జరిగితే వాహనదారులకు, పాదచారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు.
పట్టణ అభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న ఈ పనులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులకు ఆటంకాలు కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలకు పోలీసుల అడ్డుకట్ట

నాలుగు టిప్పర్లు పట్టివేత.. కేసు నమోదు.

వర్ధన్నపేట/అక్టోబర్ 4(జర్నలిస్ట్ వార్త); వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామ శివారులో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు నవంబర్ 3న ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఎస్సై బి. ప్రవీణ్ సిబ్బందితో కలిసి గ్రామ శివారుకు చేరుకున్నారు. అక్కడ అక్రమంగా మట్టి తవ్వి టిప్పర్లలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి. ప్రవీణ్ హెచ్చరించారు. ప్రభుత్వ సంపదను అక్రమంగా తరలించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బాణసంచా విక్రయాల్లో నిర్లక్ష్యం వద్దు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు- వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్



వర్ధన్నపేట/అక్టోబర్ 4(జర్నలిస్ట్ వార్త);; దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయదారులు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ సూచించారు. సంబంధిత అధికారుల నుంచి లైసెన్సులు, అనుమతులు పొందిన తర్వాతే బాణసంచా విక్రయించాలని స్పష్టం చేశారు.
దుకాణాల్లో అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్లు, నీటి సదుపాయం తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పరిసరాల్లో ధూమపానం, అగ్గిపుల్లలు వెలిగించడం నిషేధమని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన నాణ్యమైన బాణసంచానే విక్రయించాలని, నిషేధిత బాణసంచాకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.పోలీసులు, అగ్నిమాపక శాఖ, అంబులెన్స్ అత్యవసర నంబర్లను దుకాణాల్లో కనిపించేలా ప్రదర్శించాలన్నారు. చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కొనుగోలు చేసేలా చూడాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే విక్రయదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపార లాభాల కంటే ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సై ప్రవీణ్ స్పష్టం చేశారు.

వృద్ధులకు అండగా బాస్.. నిత్యావసర సరుకుల పంపిణీ

నాలుగేళ్లుగా నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు

నిరుపేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు.. త్వరలో ఉచిత కుట్టు శిక్షణ

వైరా/నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త):



సామాజిక సేవే లక్ష్యంగా బహుజన అభ్యుదయ సేవా సమితి (బాస్), హ్యూమన్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో వైరా మండలం గన్నవరం గ్రామంలో వృద్ధులకు నిత్యావసర కిరాణా సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా గన్నవరం గ్రామంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వృద్ధులు, వితంతువులకు పలుమార్లు నిత్యావసర సరుకులతో పాటు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు వివరించారు.అంతేకాకుండా ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న నిరుపేద విద్యార్థుల కోసం సాయంత్రం వేళ ఉచిత ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఏడాది పాటు విద్యార్థులకు అల్పాహారం అందించినట్లు తెలిపారు. విద్యతో పాటు పేద విద్యార్థుల సంక్షేమానికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.సంస్థ అధ్యక్షురాలు ఆదూరి మణి మాట్లాడుతూ గన్నవరం గ్రామంలో త్వరలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైరా మండల కేంద్రంలో కుట్టు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు సామాజిక కార్యకర్తలు, దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్స రామకృష్ణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజాపత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

వేరు వాగు ఉధృతం..
పలు గ్రామాలకు రాకపోకలు బంద్!

బ్రిడ్జిపై పది అడుగుల మేర వరద నీరు.. స్తంభించిన ప్రజా రవాణా

విద్యార్థులు, రైతులు, కూలీలకు తప్పని ఇబ్బందులు



తల్లాడ/నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండలంలో మురసు తుఫాన్ ప్రభావంతో వరద బీభత్సం కొనసాగుతోంది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, రామచంద్రపురం గ్రామాల మధ్య ఉన్న వేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు పొంగి పొర్లడంతో ప్రధాన రహదారి నీట మునిగి పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

బిల్లుపాడు నుంచి కొత్త వెంకటగిరి, రామచంద్రపురం మీదుగా తల్లాడకు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ మార్గం మీదుగా ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, రైతులు, ఇతర పనుల నిమిత్తం తల్లాడకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాగుపై ఉన్న బ్రిడ్జి మీద సుమారు పది అడుగుల లోతులో వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయి ప్రజా జీవనం స్తంభించింది. వరద ఉధృతి తగ్గే వరకు వాగు దాటేందుకు ఎవరూ సాహసించవద్దని, అధికారులు తక్షణమే స్పందించి ప్రజల భద్రతకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి..

కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి దండు శ్రీనివాస్ డిమాండ్

కేసముద్రం/నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త):



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడటం తీవ్రంగా కలచివేసిందని మలిదశ తెలంగాణ ఉద్యమ విద్యార్థి యువజన జేఏసీ పూర్వ కన్వీనర్, కేసముద్రం ఉద్యమకారుల ఫోరం ప్రతినిధి దండు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట పీఏసీఎస్ డైరెక్టర్‌గా పనిచేసిన లక్ష్మణ్ గౌడ్ మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా దండు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లక్ష్మణ్ గౌడ్ ఎన్నో పోరాటాలు చేశారని, ఉద్యమ సమయంలో పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారని, అనేక కేసులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు.తెలంగాణ సాధన కోసం జీవితాలను సైతం పణంగా పెట్టిన ఉద్యమకారుల కుటుంబాలు నేడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆందోళనకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యమకారులను, వారి కుటుంబాలను గుర్తించి ఆదుకోవాలని దండు శ్రీనివాస్ కోరారు.

రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దతు ధర పొందేలా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి

ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి



ఎల్కతుర్తి/నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎల్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినె సంతాజీ, ఎల్ఎస్-సీఎస్ చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తోందని ఐకేపీ ఏపీఎం కవిత తెలిపారు. ఐకేపీ కేంద్రాల్లో అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్‌రావు, గ్రామ సర్పంచ్ మంకని పద్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఏఎంసీ డైరెక్టర్లు, ఎల్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు, జీలుగుల గ్రామ సర్పంచ్ గణబోయిన శైలజ రాజు, ఐకేపీ ఏపీఎం కవిత, మండల అధ్యక్షురాలు సీఏ స్వర్ణలత, గొర్రె శ్యామల, వివిధ గ్రామాల సర్పంచులు, మహిళా సంఘాల సీఏలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పశువైద్య కేంద్రంలో
డాక్టర్ లేకుండానే వైద్యం!

వైద్యురాలి విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులా?

వైద్యం పేరుతో డబ్బుల వసూళ్ల ఆరోపణలు.. పశుపోషకులకు ఆర్థిక నష్టం

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏది? సమగ్ర విచారణకు గ్రామస్తుల డిమాండ్



కల్లూరు/నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):

మండల పరిధిలోని చెన్నూరు ప్రభుత్వ పశువైద్య కేంద్రంలో విధుల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ వైద్యాధికారి విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో, ఆమె నిర్వహించాల్సిన వైద్య సేవలను ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులు అందిస్తున్నారనే విమర్శలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. పశువులకు చికిత్స అందిస్తున్న వ్యక్తులకు తగిన వైద్య అర్హతలు, అనుభవం, అధికారిక అనుమతులు ఉన్నాయా లేదా అన్న అంశంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

డాక్టర్ లేకుండా వైద్య సేవలెలా?

ప్రభుత్వ పశువైద్య కేంద్రానికి వైద్యురాలు విధులకు రాకుండానే తాళాలు తెరుచుకుని వైద్య సేవలు కొనసాగడం వెనుక ఎవరున్నారు? ఆసుపత్రి తాళాలను ప్రైవేటు వ్యక్తుల చేతికి ఎవరు అప్పగించారు? ప్రభుత్వ వైద్యురాలి పర్యవేక్షణ లేకుండా పశువులకు చికిత్స అందించేందుకు అనుమతి ఇచ్చిందెవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైద్యురాలు విధులకు గైర్హాజరవుతున్నారా? లేక విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారా? అన్నది ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

వైద్యం పేరుతో వసూళ్ల ఆరోపణలు

మరోవైపు పశువులకు వైద్యం అందించే పేరుతో పశు పోషకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరైన వైద్య అర్హతలు, పర్యవేక్షణ లేకుండా చికిత్సలు అందించడం వల్ల పలువురు రైతులు ఆర్థికంగా నష్టపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పశువులకు అందించే చికిత్సలో నిర్లక్ష్యం జరిగి అవి అనారోగ్యానికి గురైతే బాధ్యత ఎవరిది? పశువులు మృత్యువాత పడితే నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారు? అనే ప్రశ్నలు పశుపోషకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఏది?

మూగజీవాలకు సకాలంలో వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ పశువైద్య కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితులపై ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేటు వ్యక్తులు వైద్య సేవలు అందించేందుకు జిల్లా అధికారుల అనుమతి ఉందా? ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ విధుల పరిధిని దాటి వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నారా? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు ఇంతకాలం ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.



సమగ్ర విచారణ చేపట్టాలి

ఇప్పటికైనా జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు స్పందించి చెన్నూరు ప్రభుత్వ పశువైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వైద్యురాలి హాజరు రికార్డులు, సిబ్బంది విధుల వివరాలు, చికిత్సలు అందిస్తున్న వారి విద్యార్హతలు, అధికారిక అనుమతులు, పశుపోషకుల నుంచి వసూలు చేస్తున్న నగదు వివరాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు, నష్టపోయిన పశుపోషకులకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

కూటమికి పట్టం కట్టిన తెలుగు తమ్ముళ్లు.. ప్రజాతీర్పుపై హర్షాతిరేకాలు

వైసీపీ కుట్రలు, అడ్డంకులను అధిగమించి కూటమి ఘనవిజయం.. ప్రజా పాలనకు జైకొట్టిన ఆంధ్రప్రదేశ్ ఓటర్లు

చంద్రబాబు, మోదీ, పవన్ కల్యాణ్‌లకు అభినందనలు తెలిపిన టీడీపీ నాయకులు

మధిర/నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):



ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు సాధించిన ఘనవిజయం పట్ల మధిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. ప్రజా సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి ప్రజలు మరోసారి పట్టం కట్టారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మధిర పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన అభినందన సమావేశంలో నాయకులు కూటమి విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంటరీ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ రెండున్నరేళ్ల కూటమి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, బహుముఖ అభివృద్ధి, నూతన పెట్టుబడులు, పారిశ్రామిక ప్రగతి, ఆధునిక సాంకేతికత, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రజలు మద్దతు తెలిపారని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ ఎన్నికల ఫలితాలు ప్రజామోదానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ అనేక ప్రయత్నాలు చేశారని విమర్శించారు. న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బలు తగిలిన అనంతరం నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్ వరకు వివిధ రూపాల్లో అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగినా, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు టీడీపీ శ్రేణులు సంయమనం పాటిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పనిచేశాయని తెలిపారు.

వైసీపీ నాయకత్వం అనుసరించిన వైఖరి, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, అనైతిక రాజకీయాలను ప్రజలు అసహ్యించుకున్నారని, అందుకే కూటమి పార్టీలకు భారీ విజయాన్ని అందించి వైసీపీకి గట్టి గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. ఈ ఘనవిజయానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర నాయకుడు చేకూరి శేఖర్‌బాబు మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య పురపాలక, నగరపాలక సంస్థల స్థానాల కేటాయింపు, అభ్యర్థుల సర్దుబాటు, ఎన్నికల వ్యూహాల రూపకల్పన వంటి అంశాలతో ఒకవైపు సవాళ్లు ఎదురవుతుండగా, మరోవైపు వైసీపీ సృష్టించిన అడ్డంకులను అధిగమిస్తూ చంద్రబాబు ఎన్నికల పోరాటాన్ని సమర్థంగా నడిపించారని అన్నారు. జగన్‌రెడ్డి బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోకుండా ప్రజాస్వామ్య బాధ్యత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు.

మధిర పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు మాట్లాడుతూ ఏకగ్రీవ ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో అక్కడి వారికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనని గతంలో జగన్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. తన మాటకు కట్టుబడి ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడా పోటీ చేయకూడదని వ్యాఖ్యానించారు.

ఈ సమావేశంలో ఐటీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్, పట్టణ టీడీపీ కార్యదర్శి సట్టు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ బోడేపూడి రేవతి, సీనియర్ నాయకులు చెరుకూరి కృష్ణారావు, వేల్పులకొండ, చెన్నం స్వామి, మహిళా నాయకురాలు మేడిపల్లి రాణి తదితరులు మాట్లాడుతూ కూటమి విజయంపై ఆనందం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో పాశం రామనాథం, వాసిరెడ్డి ప్రకాశరావు, మధిర పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు మేడా వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు వంగాల రామకోటి, పోతినేని కోటేశ్వరరావు, గడ్డం మల్లికార్జునరావు, కేశవపట్నం రామయ్య, తిరుపతి కృష్ణమూర్తి, అనుమోలు సతీష్, బోడేపూడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఈశ్వర్, చటారి మునిలి, గద్దల నరసింహారావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్‌హెచ్‌ఓ నరసింహారావు

ఎల్కతుర్తి/ నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నరసింహారావు సూచించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం శాంతినగర్‌లోని సెంటాన్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థ పనితీరు, పోలీసుల విధులు, చట్టాలు, నేరాల నియంత్రణ, సామాజిక సమస్యలపై విద్యార్థులకు వివరించారు.



పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను తెలుసుకున్న అనంతరం కేసు స్వభావాన్ని బట్టి సంబంధిత చట్టాలు, సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్‌హెచ్‌ఓ వివరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విధులు, సిబ్బంది బాధ్యతలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల దర్యాప్తు, విచారణ ప్రక్రియలను విద్యార్థులకు తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, ఎస్ఐ కార్యాలయం, మహిళా విభాగాలను స్వయంగా చూపిస్తూ వాటి విధులను వివరించారు.

మత్తు పదార్థాల మాయలో పడొద్దు



చిన్న వయసులోనే గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారినపడి జీవితాలను అంధకారం చేసుకోవద్దని నరసింహారావు హెచ్చరించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు, వినియోగం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే నిర్భయంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సోషల్ మీడియాతో జాగ్రత్త.. ఒక్క పొరపాటు జీవితానికే ముప్పు

ప్రస్తుత సాంకేతిక యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు, ఇతర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. గుర్తుతెలియని లింకులు తెరవడం, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఇతరులకు అందించడం వంటి పొరపాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పోలీసులంటే విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత అని ఆప్యాయంగా వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదించేందుకు వెనుకాడవద్దని భరోసా కల్పించారు. చట్టాలపై అవగాహన, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు విఠల్‌రావు, వెంకట్‌రెడ్డి, మహిళా కానిస్టేబుళ్లు సుప్రియ, మోనికా, దివ్య, భగవాన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగైన గాడిదల వాగు..

ఆక్రమణలతో వ్యవసాయ భూములుగా మార్పు!

తామర చెరువు నుంచి బేతుపల్లి పెద్ద చెరువు వరకు వాగు ఆనవాళ్లు మాయం వర్షం వస్తే రహదారులే వాగులు..

అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ ఆగ్రహం గాడిదల వాగుకు పూర్వ వైభవం తీసుకురావాలి: బాణోత్ విజయ్



సత్తుపల్లి/నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):
సత్తుపల్లి పట్టణంలో ఒకప్పుడు వర్షపు నీటికి సహజ ప్రవాహ మార్గంగా, చెరువులు, కుంటలకు జీవనాధారంగా ఉన్న గాడిదల వాగు నేడు కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంది. వాగు పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైందని, సహజ నీటి ప్రవాహ మార్గాన్ని కొందరు వ్యవసాయ భూములుగా మార్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా వర్షాకాలంలో వరద నీరు వెళ్లేందుకు దారి లేక రహదారులపైకి, జనావాసాల్లోకి చేరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సత్తుపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాణోత్ విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సత్తుపల్లి పట్టణంలోని తామర చెరువు నుంచి అయ్యగారిపేట మీదుగా కాకర్లపల్లి వరకు, అక్కడి నుంచి బేతుపల్లి పెద్ద చెరువుకు చేరుకునేలా గాడిదల వాగుకు ఒకప్పుడు సహజమైన ప్రవాహ మార్గం ఉండేదని ఆయన గుర్తుచేశారు. వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు ఈ వాగు ద్వారా దిగువ ప్రాంతాలకు చేరుకుని చెరువుల్లో కలిసేదని తెలిపారు. అయితే క్రమంగా వాగు పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు పెరగడం, ప్రవాహ మార్గంలో అడ్డంకులు ఏర్పడటంతో వాగు తన ఉనికిని కోల్పోయే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వాగు భూములు పాలాలుగా మారాయా?

ముఖ్యంగా తామర చెరువు కట్ట దిగువన ఉన్న వాగు ప్రాంతంలో కొంతమంది భూములను ఆక్రమించి వ్యవసాయ భూములుగా మార్చుకున్నారనే ఆరోపణలు



ఉన్నాయని బాణోత్ విజయ్ పేర్కొన్నారు. వాగు ప్రవహించాల్సిన ప్రాంతాలను పూడ్చివేయడం, అడ్డంకులు సృష్టించడం వల్ల సహజ నీటి ప్రవాహానికి తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. ఒకప్పుడు తామర చెరువు నుంచి బేతుపల్లి పెద్ద చెరువు వరకు నిరంతరంగా సాగిన నీటి ప్రవాహం నేడు ఎక్కడికక్కడ నిలిచిపోతున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు.

వర్షం వస్తే రహదారులే వాగులు!

వాగు ప్రవాహ మార్గం కుంచించుకుపోవడం, ఆక్రమణలు పెరగడం వల్ల వర్షాకాలంలో సమస్య తీవ్రరూపం దాల్చుతోందని తెలిపారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక రహదారులపైకి చేరుతోందని, దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు సైతం వరద ముప్పుతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో భారీ వర్షాల సమయంలో ఇళ్లలోకి నీరు చేరి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఆక్రమణలపై అధికారుల మౌనం ఎందుకు?

గాడిదల వాగు ఆక్రమణలపై ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు ఇప్పటివరకు సమగ్ర విచారణ చేపట్టకపోవడం ఏమిటని బాణోత్ విజయ్ ప్రశ్నించారు. సామాన్యులు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినా వెంటనే స్పందించే అధికారులు, వాగు పరిధిలో ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. పేదల నిర్మాణాల విషయంలో చూపించే చొరవ, ప్రభావవంతమైన వ్యక్తుల ఆక్రమణల విషయంలోనూ కనిపించాలని అన్నారు.

హైడ్రా తరహాలో ఆక్రమణల తొలగింపుపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో సత్తుపల్లిలోని గాడిదల వాగు విషయంలోనూ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలకు పాల్పడినవారు ఎవరైనా సరే రాజకీయ పలుకుబడి, ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

వాగు పునరుద్ధరణకు ఎనిమిది డిమాండ్లు

గాడిదల వాగు అసలు ప్రవాహ మార్గాన్ని తక్షణమే గుర్తించాలని, తామర చెరువు నుంచి అయ్యగారిపేట, కాకర్లపల్లి మీదుగా బేతుపల్లి పెద్ద చెరువు వరకు సమగ్ర సర్వే నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసింది. పాత ప్రభుత్వ రికార్డులు, రెవెన్యూ మ్యాపులు, సర్వే నంబర్ల ఆధారంగా వాగు అసలు హద్దులను నిర్ధారించాలని కోరింది. ఆక్రమణలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని వాటిని తొలగించాలని, వాగులో ఏర్పడిన అడ్డంకులను తొలగించి వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని సూచించింది. తామర చెరువు నుంచి బేతుపల్లి పెద్ద చెరువు వరకు సహజ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడంతో పాటు భవిష్యత్తులో వరద ముప్పు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేసింది.

ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గాడిదల వాగు అసలు స్వరూపం, హద్దులు, ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలని బాణోత్ విజయ్ కోరారు. ఆక్రమణల ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. వాగు కనుమరుగైతే దాని ప్రభావం కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదని, మొత్తం పట్టణానికి వరద ముప్పు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు నష్టం వాటిల్లకముందే అధికారులు స్పందించి గాడిదల వాగుకు పూర్వ వైభవం తీసుకురావాలని సత్తుపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాణోత్ విజయ్ డిమాండ్ చేశారు.

మురసు తుఫాన్ దెబ్బకు నేలకొరిగిన వరి పంటలు!

చేతికొచ్చిన పంట నీటిపాలు.. కంకుల్లోనే మొలకలు

ఐదు ఎకరాల్లో రూ.2.50 లక్షల పెట్టుబడి నష్టం.. రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి

తల్లాడ/నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):
మురసు తుఫాన్ గొల్లగూడెం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి. తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలో వరద నీటి ఉధృతికి వరి పంటలు పూర్తిగా నేలకొరిగాయి. మరో వారం, పది రోజుల్లో చేతికొస్తుందనుకున్న పంట నీటిపాలైంది. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలవడంతో వరి కంకులు నీటిలోనే నానిపోయి మొలకలు వస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఐదు ఎకరాల్లో రూ.2.50 లక్షల పెట్టుబడి బూడిదే!

గొల్లగూడెం గ్రామానికి చెందిన రైతు కోడూరు వీరకృష్ణ తనకున్న మూడు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం ఐదు ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.50 వేల చొప్పున రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ రూపంలో ప్రకృతి విపత్తు



విరుచుకుపడటంతో సాగు చేసిన పంటంతా నేలకొరిగింది. వరద నీటిలో మునిగిన కంకులకు మొలకలు రావడంతో పెట్టిన పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పలువురు రైతులకు తీవ్ర నష్టం

గ్రామంలో కోడూరు వీరకృష్ణతో పాటు విలాసాగరం శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, కొరకొప్పు లక్ష్మయ్య, నరసింహారావు, అమర్తయ్య, బొగ్గుల పుల్లారెడ్డి, కోడూరు



వెంకటయ్య, కొండలరావు, వెంకటయ్య తదితర రైతుల వరి పొలాలు సైతం వర్షాలు, వరదల ధాటికి నేలమట్టమయ్యాయి. కష్టపడి సాగు చేసిన పంట కళ్లముందే నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి సమగ్రంగా అంచనా వేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోడూరు వీరకృష్ణ విజ్ఞప్తి చేశారు.

మురసు తుఫాన్ బీభత్సం...

నీట మునిగిన వరి పాలాలు

పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

రైతులకు అండగా ఉంటాం.. నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు సూచన





సత్తుపల్లి/నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త): మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు సత్తుపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు నీటిలో చిక్కుకోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఈ నేపథ్యంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ క్షేత్రస్థాయిలో పర్యటించి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని, వరి పంటకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. పంటల పరిస్థితి, వర్షాల కారణంగా ఎదురైన ఇబ్బందులు, నష్టం తీవ్రతపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రకృతి ప్రకోపానికి పంటలు దెబ్బతినడంతో పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు తమ ఆవేదనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఎమ్మెల్యే పంట నష్టంపై సంబంధిత వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి అంచనా వేయాలని సూచించారు. నీట మునిగిన పొలాల వివరాలను నమోదు చేసి రైతులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోయిన ప్రతిసారీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, రైతులు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పంట నష్టానికి సంబంధించి పరిష్కారం లభించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సత్తుపల్లి, వేంసూరు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాకు పోలీసులంటే లెక్కలేదా?

రాత్రంతా అక్రమ రవాణా.. ఖాకీల నిఘా ఏమైంది?

వర్ధన్నపేట నుంచి వరంగల్ వరకు ఇసుక దందా.. జిల్లా ఎస్పీ స్పందించేనా?

వర్ధన్నపేట/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త):
వర్ధన్నపేట మండలంలో ఇసుక అక్రమ రవాణా మళ్లీ పుంజుకుంటోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రివేళల్లో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు.తెల్లవారేసరికి అంతా ప్రశాంతం! ఈ వ్యవహారంపై స్థానికంగా అనేక ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి, కొత్తపల్లి గ్రామాల వాగు పరివాహక ప్రాంతాలతోపాటు ఐనవోలు మండలంలోని నందనం, రామ్‌నగర్, ఒంటిమామిడిపల్లి ప్రాంతాల్లో జేసీబీల సహాయంతో ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒంటిమామిడిపల్లి ప్రాంతం నుంచి ఇసుకను వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాలకు, వరంగల్ నగరానికి తరలించి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సీసీ కెమెరాల నిఘా ఉన్నా ప్రయోజనమేది?

వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ నుంచి ఉపరిపెల్లి క్రాస్, పంతిని, పున్నెల్లి క్రాస్, మామునూరు, పోలీస్ స్టేషన్, రంగశాయిపేట మీదుగా వరంగల్ వరకు ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రాత్రివేళల్లో ఇసుక వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి వాహనాల కదలికలను గుర్తించడం అధికారులకు సాధ్యం కావడం లేదా?

ఇంతమంది పోలీసు అధికారులు ఉన్నా..

వర్ధన్నపేట పరిధిలో ఎస్సై, సీఐ, ఏసీపీ స్థాయి అధికారులు.ఐనవోలులో ఎస్సై.మామునూరు పరిధిలో పర్వతగిరి సర్కిల్ సీఐ, మామునూరు సర్కిల్ సీఐ, ఏసీపీ. కిలా



వరంగల్ పరిధిలో సీఐ స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఇన్ని పోలీస్ స్టేషన్లు, అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పటికీ ఇసుక ఎక్కడి నుంచి వస్తోంది? ఎక్కడికి వెళ్తోంది? ఎవరు తరలిస్తున్నారు? అన్నది గుర్తించలేకపోతున్నారా? లేక సమాచారం తెలిసినా పట్టించుకోవడం లేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పోలీస్ స్టేషన్లు కేవలం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికే కాదు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించడం వంటి కీలక బాధ్యతలు నిర్వహించాలి. అయితే తమ పరిధిలో జరుగుతున్న అక్రమ రవాణాపై నిఘా పెట్టడం, ఫిర్యాదులపై స్పందించడం కూడా పోలీసుల విధుల్లో భాగమే.

మైనింగ్, రెవెన్యూ శాఖల బాధ్యత ఏది?

అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా? జేసీబీలతో తవ్వకాలు చేపడుతున్న వారికి అనుమతులు ఉన్నాయా? రవాణా చేస్తున్న వాహనాలకు చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయా? ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని వాహనాలను పట్టుకున్నారు? అనే వివరాలను మైనింగ్, రెవెన్యూ అధికారులు వెల్లడించాలి. అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

జిల్లా ఎస్పీ స్పందించేనా?

వర్ధన్నపేట నుంచి వరంగల్ నగరం వరకు సాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇసుక అక్రమ రవాణాపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలు, సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలనపై సమీక్ష నిర్వహించాలి. పోలీసు, మైనింగ్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం పెంచి అక్రమ రవాణా మూలాలను గుర్తించాలి.

ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశిస్తారా? సంబంధిత పోలీసు అధికారుల నుంచి వివరణ కోరుతారా? విధుల్లో నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటారా? వాగుల నుంచి వరంగల్ నగరం వరకు సాగుతున్న ఇసుక రవాణాకు అడ్డుకట్ట ఎప్పుడు పడుతుంది? జిల్లా పోలీసు ఉన్నతాధికారుల స్పందన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అక్షరాభ్యాసమే తొలి అడుగు

విద్యతో పాటు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు





కేసముద్రం/నవంబర్ 04 (జర్నలిస్ట్ వార్త):చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అక్షరాభ్యాసమే తొలి అడుగు అని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ నిర్వహించిన అక్షరాభ్యాసం, మొదటి ముద్ద కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, మొదటి ముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించాలని, పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యతో పాటు పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఈ. రాజమణి, ఆయా అరుణ, చిన్నారుల తల్లులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చారు.. రికార్డుల్లో నమోదు చేయడం మరిచారు!

భూ హక్కులు కల్పించి సాగుకు అవకాశం కల్పించాలి

రైతులు కమిటీలుగా ఏర్పడి భూముల గుర్తింపునకు సహకరించాలి : అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి

ఎల్కతుర్తి/నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):
పట్టాలు చేతిలో ఉన్నా.. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం భూముల వివరాలు కనిపించడం లేదు. దశాబ్దాలు గడుస్తున్నా భూములపై హక్కులు దక్కక, సాగు చేసుకునే అవకాశం లేక గుంటూరుపల్లి, దండేపల్లి గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు గతంలో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినప్పటికీ, రెవెన్యూ అధికారులు వాటిని రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో భూ యజమాన్య హక్కులు ప్రశ్నార్థకంగా మారాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బుధవారం ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అడిషనల్ కలెక్టర్ ఎన్. రవిని భూ పరిరక్షణ కమిటీ, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో బాధిత రైతులు కలిసి తమ సమస్యలను వివరించారు. గుంటూరుపల్లి, దండేపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూ సమస్యలపై ఆయనతో చర్చించి, గతంలో జరిగిన భూ పంపిణీ వివరాలను ఆధారాలతో సహా వివరించారు.

రైతుల వివరాల ప్రకారం సర్వే నంబర్ 439లో సుమారు 170 ఎకరాల భూమి ఉండగా, అందులో 90 ఎకరాలు మాత్రమే పంపిణీ చేసినట్లు తెలిపారు. 1974, 1992, 1993 సంవత్సరాల్లో గుంటూరుపల్లి, దండేపల్లి గ్రామాలకు చెందిన రైతులకు 27 గుంటల చొప్పున పట్టాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు



సుమారు 200 మంది రైతులకు 15 గుంటల చొప్పున భూములు కేటాయించినట్లు వివరించారు. అయితే పట్టాలు మంజూరైనప్పటి నుంచి రైతులకు భూములను సరిహద్దులతో గుర్తించి అప్పగించడంలో రెవెన్యూ అధికారులు, అప్పటి వీఆర్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కనీసం భూముల వివరాలను వన్‌బీ రికార్డుల్లో కూడా నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా బీపీసీఎల్ బాట్లింగ్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో తమ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని రైతులు కోరారు. సర్వే నంబర్ 439లో మిగిలిన భూముల పంపిణీ, హక్కుల గుర్తింపు విషయంలో స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరుపల్లి పరిధిలోని భూముల్లో కొంత భాగం పంపిణీ చేయగా, మిగిలిన భూముల్లో గ్రామస్తులు వివిధ రకాల పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. దండేపల్లి గ్రామ రైతులకు మాత్రం తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి రైతులతో మాట్లాడుతూ ముందుగా రైతులంతా కమిటీలుగా ఏర్పడాలని, భూముల గుర్తింపు, సర్వే, కొలతల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించినట్లు భూ పరిరక్షణ కమిటీ నాయకులు తెలిపారు. రైతులకు అవసరమైన న్యాయ సహాయం అందేలా చూస్తామని, పట్టాలు, పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు భూ యజమాన్య హక్కులు కల్పించి సాగు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. పట్టాలు లేని అర్హులైన రైతులకు కూడా భూములు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పినట్లు వివరించారు. తమ సమస్యను ఎన్నోసార్లు జిల్లా కలెక్టర్, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిష్కారం లభించలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా భూముల కోసం ఎదురుచూస్తున్న పేద రైతులకు న్యాయం చేయాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ ఎన్. రవికి రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ కమిటీ నాయకులు కామెర్ల లక్ష్మణ్, గడ్డం సంధ్య, జూపాక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పరుగుపందెం పోటీలకు ఖమ్మం కుర్రాడు

400 మీటర్ల విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం -శివపురిలో జరిగే జాతీయ పోటీలకు ప్రభుదేవ్ ఎంపిక

ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో నవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త): క్రీడారంగంలో ఖమ్మం జిల్లాకు చెందిన యువ అథ్లెట్ గంగారపు ప్రభుదేవ్ సత్తాచాటాడు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రత్యర్థులను వెనక్కినెట్టి పరుగుపందెంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అద్భుతమైన వేగం, పట్టుదలతో 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

ఖమ్మంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర అథ్లెటిక్స్ పోటీల్లో ఈ విజయం నమోదైంది. గంగారపు శ్రీనివాస్ కుమారుడైన ప్రభుదేవ్ 400 మీటర్ల పరుగుపందెంలో ఆరంభం నుంచి ఆత్మవిశ్వాసంతో పరుగెత్తుతూ ప్రత్యర్థులకు గట్టి పోటీనిచ్చాడు. నిర్దేశిత దూరాన్ని వేగంగా పూర్తి చేసి ప్రథమ స్థానాన్ని సాధించాడు. ఈ విజయంతో జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.

జాతీయస్థాయిలో సత్తా చాటేనా?
రాష్ట్రస్థాయిలో సాధించిన విజయంతో ప్రభుదేవ్‌కు జాతీయస్థాయిలో తన ప్రతిభను నిరూపించుకునే



అవకాశం లభించింది. ఈ నెల 12న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని శివపురిలో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నాడు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులతో తలపడనున్న నేపథ్యంలో ప్రభుదేవ్ ప్రదర్శనపై ఆసక్తి నెలకొంది. 400 మీటర్ల పరుగుపందెంలో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జాతీయస్థాయిలోనూ ఇదే జోరు కొనసాగించి పతకం సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రభుదేవ్ విజయం మరింత మంది యువత క్రీడల వైపు అడుగులు వేసేందుకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వరి కొయ్యలు కాలిస్తే.. భూసారం హరించినట్టే!

రబీలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి- రైతులకు ఏఓ విజయ్ కుమార్ సూచన







వర్ధన్నపేట/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త): వరి కొయ్యలను కాల్చి భూమి సారాన్ని దెబ్బతీయొద్దని వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ రైతులకు సూచించారు. రబీ సీజన్‌లో వరికి బదులుగా కందులు, పెసలు, మినుములు, కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు. ఇల్లంద గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బేతి సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలో సేంద్రియ కర్బనం తగ్గి భూసారం దెబ్బతింటుందని, దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి వేణుమాధవ్, ఏఈఓ శిల్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డ వైద్యురాలయ్యే వరకు.. చదువు బాధ్యత నాదే!

డాక్టర్ సామ్యేల్ ఉదారత.. శృతి కుటుంబానికి కొండంత భరోసా!





వరంగల్ బ్యూరో/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త); ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థిని అన్నెపర్తి శృతికి సంరక్ష హాస్పిటల్ చైర్మన్, సీనియర్ వైద్యులు డాక్టర్ ఎస్. సామ్యేల్ అండగా నిలిచారు. ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు ఆమె విద్యకు అవసరమైన ఫీజులు, ఇతర ఖర్చులన్నీ భరిస్తానని ప్రకటించారు. వర్ధన్నపేటకు చెందిన శృతి ప్రస్తుతం ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఆమె చదువుకు ఆటంకంగా మారిన విషయాన్ని మహా ఆది సేవ సంస్థ (మాస్) ప్రతినిధులు డాక్టర్ సామ్యేల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మొదటి సంవత్సరం ఫీజు కోసం రూ.లక్ష, తాజాగా ద్వితీయ సంవత్సరం ఫీజు కోసం మరో రూ.లక్ష అందించారు. ఇప్పటివరకు మొత్తం రూ. 2 లక్షల సాయం చేశారు. శృతి వైద్య విద్య పూర్తిచేసి మంచి వైద్యురాలిగా ఎదిగే వరకు ఆర్థిక ఇబ్బందుల గురించి ఆలోచించకుండా చదువుపైనే దృష్టి పెట్టాలని భరోసా ఇచ్చారు.

'సమాజానికి తిరిగి ఇవ్వడం' అనే నినాదంతో మాస్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు విద్యార్థుల ఉన్నత విద్య కోసం సుమారు రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ సీనపెల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, డాక్టర్ విక్రమ్ కుమార్, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ నివేదిత, డాక్టర్ సునీల్ చంద్ర, ప్రభాకర్, డి. శ్రీనివాస్, బి. రాజేష్, ఎన్. బాబు, సి. బాబు తదితరులు పాల్గొన్నారు.

శిథిలాల నుంచి శివధామంగా..

కాకతీయుల నాటి ముఖ్యనాథస్వామి ఆలయానికి మూడేళ్లు!

భక్తుల సంకల్పానికి ప్రతిరూపంగా పురాతన ఆలయ పునరుద్ధరణ నవంబర్ 16న వైభవంగా తృతీయ వార్షికోత్సవాలు.. పోస్టర్ ఆవిష్కరణ



ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త): చరిత్ర కనుమరుగవుతున్నా.. ఆధ్యాత్మిక వైభవం చెరిగిపోకూడదన్న సంకల్పం ఆ గ్రామస్తుల్లో కొత్త చరిత్రకు నాంది పలికింది. కాకతీయుల కాలం నాటి అపురూపమైన వారసత్వ సంపదగా నిలిచిన ముప్పారం గ్రామంలోని శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయం ఒకప్పుడు శిథిలావస్థకు చేరుకుని తన పూర్వ వైభవాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. అయితే భక్తుల పట్టుదల, దాతల సహకారం, ఆలయ పునఃవ్యవస్థాపకుల కృషితో ఆ పురాతన ఆలయానికి మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చారు. పరివార దేవతలతో సహా శ్రీ ముఖ్యనాథస్వామి పునఃప్రాణ ప్రతిష్ఠ నిర్వహించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గ్రామంలో మరోసారి ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఈ నేపథ్యంలో నవంబర్ 16న నిర్వహించనున్న స్వామివారి తృతీయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీవీకే కన్సల్టెన్సీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వినోద్ కుమార్, ప్రాంతీయ డైరెక్టర్ గీత రాజేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ పునఃవ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్ రవీంద్ర మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ముఖ్యనాథస్వామి ఆలయాన్ని శిథిలావస్థ నుంచి పునరుద్ధరించడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమన్నారు. తరతరాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ఆలయ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో గ్రామ ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.నవంబర్ 16వ తేదీ సోమవారం స్వామివారి తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రహోమాలు, శ్రీ ముఖ్యనాథస్వామివారి కల్యాణ మహోత్సవం, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మహోత్సవం కేవలం వార్షికోత్సవ వేడుక మాత్రమే కాదని, గ్రామ ఆధ్యాత్మిక ఐక్యతను చాటిచెప్పే పవిత్ర సందర్భమని పేర్కొన్నారు. ముప్పారం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, శివభక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి ఆకారపు సురేష్, గౌరవ సలహాదారులు గొట్టిముక్కుల సురేష్ కుమార్, కాశిరెడ్డి రాజిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొన్నె రవీందర్ రెడ్డి, కమిటీ సభ్యులు గూల్ల కొమురయ్య, మర్రిపల్లి రాజు, యాటల శివ, గుంటిపల్లి సంపత్, సులుగూరి భిక్షపతి, ఏతిరాజుల యాదగిరి, సిద్ధంకి సాయిలు, వేములకొండ భిక్షపతి, రవి, అంబీర్ రవి, బోడ ఐలయ్య, చిట్యాల రాజేష్, బండి వెంకన్న, పరకాల ఇస్తారి, గుంటిపల్లి నగేష్, కందుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో సర్పంచ్ ఆకస్మిక తనిఖీలు

తరుగు పేరుతో తక్కువ బియ్యం ఇస్తే చర్యలు తప్పవు

ప్రతి కార్డుదారుడికి పూర్తిస్థాయిలో సన్నబియ్యం పంపిణీ చేయాలి : సర్పంచ్ బిల్లా యాదగిరి





వేలేరు/ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరోనవంబర్ 4 (జర్నలిస్ట్ వార్త): వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేషన్ దుకాణాలను గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత పాటించాలని, ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని అర్హులైన ప్రతి కార్డుదారుడికి పూర్తిస్థాయిలో అందించాలని రేషన్ డీలర్లకు సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం నాలుగు రేషన్ దుకాణాలు ఉన్నాయని, వాటి ద్వారా సుమారు 2,250 రేషన్ కార్డులకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. బియ్యం పంపిణీ సమయంలో తరుగు పేరుతో కార్డుదారులకు తక్కువ బియ్యం ఇవ్వడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. తూనికలు, కొలతల్లో ఎలాంటి తేడాలు లేకుండా నిబంధనల ప్రకారం బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి కార్డుదారుడికి ప్రభుత్వం కేటాయించిన పరిమాణంలో బియ్యం అందేలా డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడినా, తూనికలు, కొలతల్లో తేడాలు గుర్తించినా, కార్డుదారులకు అన్యాయం చేసినా సంబంధిత రేషన్ డీలర్లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చేరాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

-ఆర్ఎస్పీ రాష్ట్ర కమిటీ డిమాండ్



వర్ధన్నపేట/నవంబర్ 4(జర్నలిస్ట్ వార్త): శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎల్బీ విద్యార్థిని డాకూరి చంద్రకళ ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ఆర్ఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. ఆమె మృతికి దారితీసిన పరిస్థితులను వెలికితీసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న గజ్జల హరికృష్ణపై చట్టప్రకారం విచారణ జరపాలన్నారు. ఫోన్ కాల్ రికార్డులు, చాటింగ్ వివరాలు, ఇతర డిజిటల్ ఆధారాలను సేకరించి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా దర్యాప్తు చేయాలని కోరారు. చంద్రకళ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కందికట్ల శ్రీనివాసు, పసుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రేయసికి అంకితమైన అర్ష్‌దీప్ వికెట్ సంబరాలు!

- న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో ప్రత్యేక నృత్యంతో సందడి.. ప్రేయసి సమ్రీన్ కౌర్ కోసమేనని వెల్లడించిన భారత పేసర్



ఆక్లాండ్: భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మైదానంలో చేసిన ఓ ప్రత్యేక సంబరం అభిమానులను ఆకట్టుకుంది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో వికెట్ తీసిన అనంతరం అతడు చేసిన వినూత్న నృత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ సంబరం వెనుక ఉన్న అసలు కారణాన్ని అర్ష్‌దీప్ స్వయంగా వెల్లడించడంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్‌కు ఆ సంబరాన్ని అంకితం చేసినట్లు తెలిపాడు.**వికెట్ తీసి.. ప్రత్యేకంగా సంబరాలు**న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా కైల్ జేమీసన్‌ను ఔట్ చేసిన అనంతరం అర్ష్‌దీప్ మైదానంలో ప్రత్యేకమైన నృత్యంతో సంబరాలు చేసుకున్నాడు. అతడి వినూత్న హావభావాలు చూసి సహచర ఆటగాళ్లతోపాటు అభిమానులు కూడా ఆశ్చర్యపోయారు.**ప్రేయసి కోసమేనని వెల్లడి**తన సంబరాల వెనుక ఉన్న కారణాన్ని మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ వివరించాడు. తాను, తన ప్రేయసి బయటకు వెళ్లినప్పుడు సరదాగా చేసే నృత్య అడుగులనే మైదానంలో ప్రదర్శించినట్లు తెలిపాడు. ఇద్దరిలో ఎవరికైనా మానసికంగా ఉత్సాహం తగ్గినప్పుడు ఇలాంటి చిన్న చిన్న సంబరాలతో ఒకరినొకరు ఉత్సాహపరుచుకుంటామని చెప్పాడు. అందుకే ఈసారి వికెట్ తీసిన ఆనందాన్ని ఆమెకు అంకితం చేసినట్లు వెల్లడించాడు.**నాలుగు వికెట్లతో ఆకట్టుకున్న పేసర్**ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ తన బౌలింగ్‌తోనూ ఆకట్టుకున్నాడు. పది ఓవర్లలో 70 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. విల్ యంగ్, హెన్రీ నికోల్స్, కైల్ జేమీసన్, గ్లెన్ ఫిలిప్స్‌లను పెవిలియన్‌కు పంపాడు. అతడికి గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లు, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లతో సహకరించారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే ఆలౌటైంది.**అభిమానుల్లో ఆసక్తి**అర్ష్‌దీప్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మైదానంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. గతంలోనూ తన ప్రేయసి సమ్రీన్ కౌర్‌పై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విమర్శలను అర్ష్‌దీప్ ఖండించాడు. వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని అభిమానులకు సూచించాడు. తాజాగా మైదానంలో ఆమెకు ప్రత్యేకంగా సంబరాన్ని అంకితం చేయడంతో ఈ జంట మరోసారి వార్తల్లో నిలిచింది.క్రికెట్ మైదానంలో వికెట్ సాధించడం ఆటగాడికి ఆనందాన్ని ఇస్తుంది. ఆ ఆనందాన్ని తన జీవితంలో ప్రత్యేకమైన వ్యక్తితో పంచుకోవడం అర్ష్‌దీప్ సంబరానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఒకవైపు అద్భుతమైన బౌలింగ్‌తో జట్టుకు విజయావకాశాలు అందిస్తూనే, మరోవైపు తనదైన శైలిలో సంబరాలు చేసుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. దీంతో అర్ష్‌దీప్ వికెట్ సంబరం మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ ప్రపంచ రికార్డు!

- మూడో స్థానంలో 13 వేల పరుగుల మైలురాయి.. ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించిన కింగ్ కోహ్లీ



ఆక్లాండ్: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 వేల పరుగులు పూర్తి చేసిన ప్రపంచంలోనే తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఈ ఘనత సాధించాడు. ఇప్పటికే ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకున్న కోహ్లీ, తాజాగా మరో మైలురాయిని అందుకుని తన ప్రత్యేకతను చాటుకున్నాడు.**12 పరుగులతో చరిత్రలోకి..** ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా భారత్-న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే జరిగింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 186 పరుగుల లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీకి ఈ అరుదైన రికార్డును అందుకునే అవకాశం వచ్చింది. మ్యాచ్‌కు ముందు మూడో స్థానంలో 13 వేల పరుగులు పూర్తి చేయడానికి అతడికి మరో 12 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులోకి వచ్చిన కోహ్లీ తాను ఎదుర్కొన్న 13వ బంతికి 12వ పరుగు సాధించడంతో చారిత్రక మైలురాయిని చేరుకున్నాడు. దీంతో వన్డే క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు.**పాంటింగ్ రికార్డును అధిగమించిన కోహ్లీ**వన్డేల్లో మూడో స్థానంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ రెండో స్థానంలో ఉన్నాడు. పాంటింగ్ తన కెరీర్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 12,662 పరుగులు సాధించాడు. కోహ్లీ తాజాగా 13 వేల పరుగుల మార్కును అందుకోవడంతో అతడి కంటే ముందంజలో నిలిచాడు. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర 9,747 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో కోహ్లీ, పాంటింగ్ మాత్రమే 10 వేల పరుగుల మార్కును దాటడం విశేషం.**నిలకడకు నిదర్శనం కోహ్లీ ప్రస్థానం**వన్డే క్రికెట్‌లో మూడో స్థానం అత్యంత కీలకమైన బ్యాటింగ్ స్థానంగా భావిస్తారు. ప్రారంభంలో వికెట్లు త్వరగా పడితే ఇన్నింగ్స్‌ను నిలబెట్టాల్సి ఉంటుంది. ఓపెనర్లు మంచి ఆరంభం ఇస్తే పరుగుల వేగాన్ని పెంచాల్సి ఉంటుంది. ఈ రెండు బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ కోహ్లీ ఎన్నో సంవత్సరాలుగా భారత జట్టుకు అండగా నిలుస్తున్నాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడటం, లక్ష్య ఛేదనలో బాధ్యత తీసుకోవడం అతడి ప్రత్యేకతగా నిలిచాయి. ఈ క్రమంలోనే మూడో స్థానంలో 13 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు.**శతకాలు, అర్ధశతకాలతో ప్రత్యేక గుర్తింపు** మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ కోహ్లీ 48 సెంచరీలు, 69 అర్ధసెంచరీలు సాధించాడు. అతడి సగటు కూడా 61కు పైగా ఉండటం విశేషం. అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలోనూ సచిన్ టెండూల్కర్ తర్వాతి స్థానంలో కోహ్లీ కొనసాగుతున్నాడు. ప్రతి మ్యాచ్‌లోనూ కొత్త రికార్డుల దిశగా సాగుతున్న అతడి ప్రస్థానం భారత క్రికెట్ అభిమానులకు ప్రత్యేక ఆనందాన్ని అందిస్తోంది.**సచిన్ రికార్డుపై కన్ను**వన్డే క్రికెట్‌లో ఒక నిర్దిష్ట బ్యాటింగ్ స్థానంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సచిన్ 15,310 పరుగులు సాధించాడు. ఇప్పుడు మూడో స్థానంలో 13 వేల పరుగులు పూర్తి చేసిన కోహ్లీ, ఈ అరుదైన ఘనతతో మరోసారి ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లను చేరుకునే అవకాశం అతడికి ఉంది.రికార్డులు సృష్టించడం ఒక ఎత్తయితే.. వాటిని నిలకడైన ప్రదర్శనతో అందుకోవడం మరో ఎత్తు. విరాట్ కోహ్లీ ప్రస్థానం ఈ విషయాన్ని నిరూపిస్తోంది. జట్టుకు అవసరమైన సమయంలో బాధ్యత తీసుకుంటూ, పరుగుల వేటలో తనదైన ముద్ర వేస్తున్నాడు. వయసుతో సంబంధం లేకుండా ఆటపై అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతున్నాడు. మూడో స్థానంలో 13 వేల పరుగుల ప్రపంచ రికార్డు కోహ్లీ వ్యక్తిగత ఘనత మాత్రమే కాదు.. భారత క్రికెట్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిపోనుంది.

స్లెడ్జింగ్‌తో రెచ్చగొట్టి.. వికెట్‌తో బదులిచ్చిన గుర్నూర్ బ్రార్!



- బ్లెయిర్ టిక్నర్‌తో మాటల యుద్ధం.. మరుసటి బంతికే పెవిలియన్‌కు పంపిన భారత యువ పేసర్.. వైరల్‌గా మారిన వీడియో

ఆక్లాండ్: భారత్-న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి వన్డేలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్, న్యూజిలాండ్ బ్యాటర్ బ్లెయిర్ టిక్నర్ మధ్య మైదానంలో జరిగిన మాటల యుద్ధం అభిమానులను ఆకట్టుకుంది. ప్రత్యర్థి బ్యాటర్‌ను మాటలతో రెచ్చగొట్టిన గుర్నూర్.. మరుసటి బంతికే వికెట్ తీసి తన సత్తా చాటాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.**మాటల యుద్ధానికి తెరలేపిన గుర్నూర్** న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 41వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. అప్పటికే చివరి వికెట్ కోసం భారత బౌలర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. క్రీజులో ఉన్న బ్లెయిర్ టిక్నర్ దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ భారత బౌలర్లకు సవాల్ విసురుతున్నాడు. ఈ క్రమంలో గుర్నూర్ వేసిన బౌన్సర్‌ను టిక్నర్ సరిగ్గా ఆడలేకపోయాడు. దీంతో గుర్నూర్ పుల్ షాట్ ఎలా ఆడాలో చేతులతో సైగలు చేస్తూ టిక్నర్‌ను ఆటపట్టించాడు.**తగ్గేదేలే అన్న టిక్నర్.. బౌలర్‌కు సవాల్** గుర్నూర్ సైగలకు టిక్నర్ కూడా ధీటుగా స్పందించాడు. వికెట్లను లక్ష్యంగా చేసుకుని బంతులు వేయాలని బౌలర్‌కు సూచిస్తూ బదులిచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు సరదా మాటల యుద్ధం సాగింది. అయితే గుర్నూర్ మాత్రం మాటలకే పరిమితం కాకుండా బంతితో సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నాడు.**మరుసటి బంతికే వికెట్.. సంబరాల్లో గుర్నూర్** టిక్నర్‌కు గుర్నూర్ వేసిన తర్వాతి బంతి కూడా షార్ట్ పిచ్‌గానే వచ్చింది. దాన్ని పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన టిక్నర్ బ్యాట్ అంచుకు తగిలించడంతో బంతి వికెట్ల వెనుకకు వెళ్లింది. అప్రమత్తంగా ఉన్న వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ క్యాచ్ అందుకోవడంతో టిక్నర్ ఇన్నింగ్స్ ముగిసింది. వెంటనే గుర్నూర్ సంబరాలు చేసుకున్నాడు. టిక్నర్ కూడా చిరునవ్వుతో మైదానాన్ని వీడటం క్రీడాస్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.**నాలుగు సిక్సర్లతో టిక్నర్ పోరాటం** ఈ మ్యాచ్‌లో టిక్నర్ చివరి వికెట్‌గా వచ్చి భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 23 బంతుల్లో 34 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఒక ఫోర్, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. జాకబ్ డఫీతో కలిసి చివరి వికెట్‌కు 39 పరుగులు జోడించి న్యూజిలాండ్ స్కోరును పెంచాడు. వన్డేల్లో 11వ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ ఒక ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో మహమ్మద్ అమీర్, నసీమ్ షాలతో కలిసి టిక్నర్ నిలిచాడు.**మూడు వికెట్లతో గుర్నూర్ ప్రతిభ** ఈ మ్యాచ్‌లో గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లు పడగొట్టి భారత బౌలింగ్‌లో కీలక పాత్ర పోషించాడు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లతో రాణించగా, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు సాధించాడు. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది.క్రికెట్‌లో మాటల యుద్ధాలు కొత్తేమీ కాదు. అయితే ప్రత్యర్థి ఆటగాడి సవాళ్లకు మాటలతో కాకుండా ఆటతో సమాధానం చెప్పడం ప్రత్యేకత. గుర్నూర్ బ్రార్ అదే చేసి చూపించాడు. స్లెడ్జింగ్ తర్వాతి బంతికే వికెట్ సాధించడం మ్యాచ్‌లో ఆసక్తికర ఘట్టంగా నిలిచింది. మరోవైపు చివరి వికెట్‌గా వచ్చి టిక్నర్ చేసిన పోరాటం కూడా అభిమానులను ఆకట్టుకుంది. ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ సరదా పోటీ ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.

న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

- విరాట్ కోహ్లీ మెరుపు ఇన్నింగ్స్.. 74 పరుగులతో జట్టుకు అండ..

ఐదు వికెట్ల తేడాతో తొలి వన్డే కైవసం



ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు అద్భుతంగా రాణించి న్యూజిలాండ్‌ను 185 పరుగులకే కట్టడి చేయగా, లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ 74 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 37 పరుగులతో రాణించడంతో భారత్ విజయం దిశగా సాగింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ విధానంలో లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించగా, భారత్ ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. **బౌలర్ల విజృంభణ.. 185 పరుగులకే కివీస్ ఆలౌట్** టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత యువ పేసర్లు అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటగా, గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు సాధించాడు. దీంతో న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. టిమ్ సీఫర్ట్ 38, బ్లెయిర్ టిక్నర్ 34 పరుగులతో రాణించారు.**కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్.. గిల్‌తో కీలక భాగస్వామ్యం** 186 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 114 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కోహ్లీ బౌండరీలతో అలరిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.**51 బంతుల్లో 74 పరుగులు** విరాట్ కోహ్లీ కేవలం 51 బంతుల్లో 74 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. మరోవైపు గిల్ 56 బంతుల్లో 37 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. వర్షం కారణంగా పలుమార్లు ఆటకు అంతరాయం ఏర్పడటంతో డక్‌వర్త్ లూయిస్ విధానంలో భారత్ లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించారు.**సిరీస్‌లో భారత్‌కు శుభారంభం** చివరకు భారత్ 22.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 143 పరుగులు సాధించింది. దీంతో ఐదు వికెట్ల తేడాతో విజయం అందుకుంది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో తొలి వన్డేలో జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. ముఖ్యంగా యువ పేసర్ల ప్రదర్శన, కోహ్లీ బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకున్నాయి.వన్డే సిరీస్‌ను విజయంతో ప్రారంభించిన భారత్ రెండో మ్యాచ్‌లోనూ ఇదే జోరు కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. యువ బౌలర్లకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం, కోహ్లీ తన అనుభవంతో జట్టును విజయతీరాలకు చేర్చడం భారత జట్టుకు సానుకూల పరిణామాలు.

నా అభిమాన కెప్టెన్లు వారే!

సచిన్ మనసులో గంగూలీ, ధోనీకి ప్రత్యేక స్థానం



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనకు ఇష్టమైన కెప్టెన్ల పేర్లను వెల్లడించాడు. సౌరవ్ గంగూలీ, మహేంద్రసింగ్ ధోనీ తన అభిమాన కెప్టెన్లని తెలిపాడు. తాజాగా అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సచిన్ ఈ సమాధానమిచ్చాడు.భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవమని సచిన్ పేర్కొన్నాడు. అలాగే దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నాయకత్వాన్ని ప్రశంసించాడు. జట్టును ముందుండి నడిపిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాడని కొనియాడాడు.

అవకాశాలు ఇచ్చిన ఇండస్ట్రీపైనే విమర్శలా?: నిర్మాత ఎస్కేఎన్



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత ఎస్కేఎన్ (శ్రీఖచీ) చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది చిత్ర పరిశ్రమలో అవకాశాలు అందిపుచ్చుకుని, పేరు సంపాదించిన తర్వాత కొందరు తారలు అదే పరిశ్రమను విమర్శిస్తున్న తీరు సరికాదంటూ ఆయన ఘాటుగా స్పందించారు. ఈ ధోరణి దురదృష్టకరమని సోషల్ మీడియా వేదికగా అభిప్రాయపడ్డారు.“ఒక పాత్రికేయుడిగా ఇండస్ట్రీని దగ్గర నుంచి గమనిస్తున్న నాకు ఈమధ్య ఒక విచారకరమైన ధోరణి కనిపిస్తోంది. దక్షిణాది సినిమాల్లో ముఖ్యంగా తెలుగు సినిమాలో అవకాశాలు అందుకోవడం, ఇక్కడి ప్రజల ఆదరాభిమానాలతో గుర్తింపు తెచ్చుకోవడం, ఆ తర్వాత కొన్నేళ్లకు ఇదే పరిశ్రమను, ఇక్కడి కథలను, సాంస్కృతిక సంప్రదాయాలను విమర్శించడం కొందరికి అలవాటుగా మారింది.అభిప్రాయం చెప్పే హక్కు ప్రతి నటుడికి/నటికి ఉంటుంది, కాదనను. కానీ, నిర్మాణాత్మక విమర్శకు, మనల్ని ఆదరించిన పరిశ్రమను సెలెక్టివ్‌గా చిన్నచూపు చూడటానికి మధ్య చాలా తేడా ఉంది. మన తెలుగు సినిమాకు, దక్షిణాది చిత్రసీమకు ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక గుర్తింపు, కథలు చెప్పే పద్ధతి, విలువలు ఉన్నాయి. వేరే ప్రాంతం నుంచి వచ్చిన వారికి అది కొంచెం కొత్తగా, వింతగా అనిపించవచ్చు. కానీ, మన సంస్కృతిలో అది సర్వసాధారణం.గౌరవం అనేది ఎప్పుడూ ఇచ్చిపుచ్చుకోవాలి. ఇక్కడి అవకాశాలను ఆనందంగా స్వీకరించి, ఆ తర్వాత వాటి వెనుక ఉన్న సంస్కృతిని అగౌరవపరచడం సరికాదు. నిర్మాణాత్మక విమర్శలను ఎవరైనా స్వాగతిస్తారు. కానీ, ‘మాదే గొప్ప’ అనే సాంస్కృతిక ఆధిపత్య ధోరణితో కూడిన విమర్శలు మాత్రం ఆమోదయోగ్యం కాదు. మిమ్మల్ని గౌరవించిన పరిశ్రమను మీరు కూడా గౌరవించడం నేర్చుకోవాలి. ఇదే నేను చెప్పాలనుకున్నది“ అని ఎస్కేఎన్ ట్వీట్ చేశారు.


నాగార్జున సినిమాలో టబు విశ్వరూపం..
పుట్టినరోజున అదిరిపోయే సర్‌ప్రైజ్

అక్కినేని నాగార్జున హీరోగా నటిస్తున్న ‘కింగ్100’ చిత్రంపై ఆసక్తి పెరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో టబు పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. పుట్టినరోజు సందర్భంగా టబుకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ‘మహంతి ఝాన్సీ రాణి’గా ఆమెను పరిచయం చేసింది. రాజసం, రాజకీయ నేపథ్యం, గంభీరమైన వ్యక్తిత్వంతో ఈ పాత్ర ఉండబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది.

ఈ సినిమాలో టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్ ఆసక్తికరంగా ఉంది. ప్రపంచంలో రెండు రకాల మనుషులుంటారని ఆమె పాత్ర నమ్ముతుంది. ఒకరు కష్టాన్ని నమ్మేవారు.. మరొకరు అదృష్టాన్ని నమ్మేవారు. అయితే అదృష్టాన్ని నమ్మే వ్యక్తులంటే మహంతి ఝాన్సీ రాణికి అస్సలు పడదని ఈ వీడియోలో చూపించారు. ఆమె రాజకుటుంబానికి చెందిన వ్యక్తిగా, రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే నాయకురాలిగా కనిపించనుంది.

నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ ఏడాది ఆగస్టులో ‘కింగ్100’ టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. అప్పుడే సినిమా విడుదల తేదీని కూడా వెల్లడించింది. డిసెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఆ సందర్భంగా విడుదల చేసిన తొలి గ్లింప్స్‌లో నాగార్జున స్టైలిష్, హుందా లుక్‌లో కనిపించాడు.

డబ్బున్నవారు, డబ్బులేనివారు.. ప్రపంచంలో మనుషులు రెండే రకాలుగా ఉంటారని నాగార్జున తన పాత్ర ద్వారా చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. డబ్బులేనప్పుడు తనను ఓడిపోయిన వ్యక్తిగా చూశారని, డబ్బు వచ్చాక రాజుగా గుర్తించారని ఆయన చెప్పే మాటలు పాత్ర స్వభావాన్ని తెలియజేశాయి. అయితే డబ్బు కంటే తన గుర్తింపే శక్తిమంతమైనదని, దాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతరం పరుగెత్తాల్సి ఉంటుందని చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచింది.ఆర్.ఏ. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. రాజా మహదేవన్ ఛాయాగ్రహణం, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వెండితెరపై నాగార్జున, టబు పాత్రలు ఎలా సందడి చేస్తాయో చూడాలంటే డిసెంబరు 24 వరకు వేచి చూడాల్సిందే.



తమిళ సినీ పరిశ్రమకు ఇకపై రోజుకు 6 షోలు!

తమిళ సినీ పరిశ్రమకు అక్కడి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. రాష్ట్రంలోని థియేటర్లలో కొత్తగా విడుదలయ్యే తమిళ చిత్రాలకు రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇస్తూ ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా విడుదలైన మొదటి వారం రోజుల పాటు ఈ వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ఆరు షోలను ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 2:30 గంటల మధ్య ప్రదర్శించుకోవచ్చని తెలిపింది.గత కొంతకాలంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్, తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, తమిళనాడు థియేటర్ అండ్ మల్టీప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్ వంటి పలు సినీ సంఘాలు ప్రభుత్వానికి ఈ మేరకు విజ్ఞప్తి చేస్తున్నాయి. కొత్త సినిమాలకు తొలి వారంలో ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో షోల సంఖ్య పెంచడం వల్ల పరిశ్రమకు, థియేటర్ల యజమానులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని వారు తమ అభ్యర్థనలో పేర్కొన్నారు.



ఈ విజ్ఞప్తులపై సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే సీఎం జోసెఫ్ విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

వాస్తవానికి 1957 నాటి తమిళనాడు సినిమాస్ (రెగ్యులేషన్) నిబంధనల ప్రకారం రాష్ట్రంలో రోజుకు కేవలం నాలుగు షోలకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సినీ పరిశ్రమ కోరిక మేరకు, కొత్త సినిమాలకు మొదటి వారం రోజులు, అలాగే పండుగలు, ప్రభుత్వ సెలవు దినాలు, శని, ఆదివారాల్లో రోజుకు ఐదు షోలకు అనుమతి ఇచ్చింది. ఇప్పుడు దానిని మరో అడుగు ముందుకు వేసి ఆరు షోలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.కొత్త సినిమాలకు విడుదలైన మొదటి వారం మాత్రమే కాకుండా, స్థానిక పండుగ రోజులు, ప్రభుత్వ సెలవులు, వారాంతాల్లో (శని, ఆదివారాలు) కూడా రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం తన ప్రకటనలో వివరించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళ సినీ పరిశ్రమకు చెందిన నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి పరిశ్రమకు అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ ‘డ్రాగన్‘కు రవి బస్రూర్ సంగీతం..
అధికారికంగా ప్రకటించిన ప్రశాంత్ నీల్

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, సలార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న చిత్రం ‘డ్రాగన్‘. ఈ సినిమాకు సంబంధించి ప్రశాంత్ నీల్ తాజాగా ఒక కీలక అప్‌డేట్‌ను వెల్లడించాడు. ‘కేజీఎఫ్‘, ‘సలార్‘ వంటి చిత్రాలతో సంచలనం సృష్టించిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నట్లు ఆయన అధికారికంగా ధ్రువీకరించాడు.



మంగళవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో ముచ్చటించిన ప్రశాంత్ నీల్, ఒక నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చాడు. ‘డ్రాగన్‘ చిత్రానికి సంగీత దర్శకుడు ఎవరని అడగ్గా.. “ది వన్ అండ్ ఓన్లీ రవి బస్రూర్ సర్“ అని ఆయన స్పష్టం చేశాడు. ఈ ప్రకటనతో ఈ భారీ ప్రాజెక్టుపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి.ఇప్పటికే విడుదలైన ‘డ్రాగన్ గ్లింప్స్‘ ప్రకారం, ఆఫ్టన్ ట్రేడింగ్ కంపెనీ, గోల్డెన్ ట్రయాంగిల్ మధ్య జరిగే అంతర్జాతీయ స్థాయి ఓపియం వార్ నేపథ్యంలో ఈ సినిమా కథాంశం సాగనుంది. ఇందులో ఎన్టీఆర్ ‘లూగర్/డ్రాగన్‘ అనే పవర్‌ఫుల్ కిల్లర్ పాత్రలో కనిపించనున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ నార్కోటిక్స్ బ్యూరో చీఫ్‌గా, మలయాళ నటుడు బిజూ మీనన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. తొలుత ఈ ఏడాది జూన్ 25న విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం 2027 జూన్ 11న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ గత ఏడాది ఏప్రిల్ నుంచే ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొంటున్నాడు.

తొలి సినిమాకే సాహసం..
మూగవాడిగా హీరో ఎంట్రీ.. ‘ఇట్లు అర్జున’ ట్రైలర్

సాధారణంగా హీరో అంటే పవర్‌ఫుల్ డైలాగ్స్ చెప్పాలి.. హీరోయిన్‌తో రొమాంటిక్‌గా మాట్లాడాలి.. విలన్లకు స్ట్రాంగ్ వార్నింగ్‌లు ఇవ్వాలి.. అని అనుకుంటాం. అయితే ఏదైనా శారీరక లోపం ఉన్న పాత్ర చేసేందుకు చాలా మంది హీరోలు వెనుకాడుతుంటారు. కానీ, ఈ మధ్యకాలంలో ట్రెండ్ మారింది. హీరోలు ప్రయోగాలు చేసేందుకు చేసేందుకు ముందుకొస్తున్నారు. అలా తన తొలి సినిమాలోనే సాహసం చేసేందుకు ఓ హీరో సిద్ధమయ్యాడు. ‘ఇట్లు అర్జున’ అనే సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నాడు యువ నటుడు అనీష్. మహేశ్ ఉప్పల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అనస్వర రాజన్ హీరోయిన్. వెంకీ కుడుముల ఈ చిత్రాన్ని నిర్మించారు. అగ్ర నటుడు నాగార్జున సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడిన ఈ చిత్రం ఎట్టకేలకు నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.



రష్మిక హిందీ యాసపై విమర్శలు..
అండగా నిలిచిన బాలీవుడ్ నటి

బాలీవుడ్‌లో పనిచేసే దక్షిణాది నటీనటులు వారి హిందీ యాస (యాక్సెంట్) కారణంగా తరచుగా విమర్శలు, ట్రోలింగ్ ఎదుర్కోవడంపై యువ నటి కషికా కపూర్ స్పందించారు. నటులను వారి నటన ఆధారంగా చూడాలని, భాష లేదా యాస ఎప్పటికీ అడ్డంకి కాకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.“హిందీ చిత్రాల్లో పనిచేసే దక్షిణాది నటుల యాసపై విమర్శలు వస్తుంటాయి, దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?“ అని అడగగా, కషికా బదులిస్తూ.. “ఇలా జరగడం చూస్తూనే ఉన్నాం. కానీ ఒక నటుడిని/నటిని అంతిమంగా నటన ఆధారంగానే గుర్తించాలి. భాష అనేది ఎప్పటికీ అవరోధం కాకూడదు. ఇది తెలుగు చిత్ర పరిశ్రమ, ఇది హిందీ చిత్ర పరిశ్రమ అని మనం విడదీయకూడదు“ అని స్పష్టం చేశారు.

గతంలో ‘కాఫీ విత్ కరణ్‘ షోలో నటి రష్మిక మందన్న కూడా తన కెరీర్‌లో యాస విషయంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని వెల్లడించిన సంగతి తెలిసిందే. దక్షిణాదికి చెందిన దానిని కావడం వల్ల తన హిందీ యాస సహజంగానే అలా వస్తుందని, అయినా ఆ విమర్శలకు భయపడి తాను వేర్వేరు భాషల్లో పనిచేయడం ఆపనని ఆమె తెలిపారు.ఈ నేపథ్యంలో రష్మిక ఉదాహరణను ప్రస్తావిస్తూ కషికా మాట్లాడారు. “ఉదాహరణకు రష్మిక మందన్నను తీసుకోండి. ఆమె ఒక అద్భుతమైన నటి, పెర్ఫార్మర్. ఆమెను యాస లేదా భాష ఆధారంగా జడ్జ్ చేయడం సరైంది కాదు. అది ఆమె గుర్తింపులో ఒక భాగం. ఆమె మూలాలు అక్కడివి. ‘యానిమల్‘ లాంటి భారీ చిత్రాల్లో నటించి గొప్ప పనితీరు కనబరిచారు. నటులను వారి యాసను బట్టి కాకుండా, వారి ప్రతిభను చూసి అభినందించాలి“ అని కషికా కపూర్ తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు.

